www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

1

శుక్రవారం 18 ఆగస్టు 2023

గ్రూపు రాజకీయాలతో కాంగ్రెస్ సతమతం

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మండలంలో ఇటీవల గ్రూపులతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు వచ్చాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న బోర్లకుంట ప్రభుదాస్ స్థానంలో వేరే వ్యక్తిని అధిష్టానం నియమించింది. ఇది చాలామంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది. కవ్వాల్ గ్రామానికి చెందిన ముజాఫర్ ఆలీని మండల అధ్యక్షునిగా నియమించింది. కానీ అతనికి మండల సీనియర్ నాయకులెవరూ సహకరించడం లేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. బోర్లకుంట ప్రభుదాస్ గ్రూపుకు చెందిన పలువురు సీనియర్ నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అధిష్టానం స్పందించి సరైన నాయకున్ని మండల అధ్యక్షునిగా ప్రకటించకపోతే పార్టీకి రాజీనామా చేస్తానని హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు.

భూసేకరణపై కలెక్టర్‌ను కలిసిన డైరెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలో భూసేకరణకు సంబంధించిన పలు అంశాలపై గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను డైరెక్టర్ ఫైనాన్స్, పా బలరాం కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సింగరేణి సంస్థ ఉపరితల గనులకు సంబంధించిన అన్ని పనులు అనుమతులను తీసుకొని భూసేకరణ చేస్తుందని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ సురేష్, బెల్లంపల్లి ఏరియా ఇన్‌ఛార్జి జనరల్ మేనేజర్ నరేందర్ ఎస్టేట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పంట రుణ లక్ష్యం ఖరారు..!

- 2023-24 ఏడాదిలో రూ.2354కోట్లు
- కిందటేడాది టార్గెట్‌లో 69శాతం మాత్రమే పంపిణీ
- ప్రాధాన్యరంగాలకు రుణం అందించడంలోనూ అలసత్వమే
- సామాన్యులకు అందని బ్యాంకుల సహకారం

అన్నదాతలకు పెట్టుబడి కోసం ఆర్థిక చేయూతనందించేందుకు బ్యాంకులు పంట రుణ లక్ష్యాన్ని ఖరారుచేశాయి. 2023-24 ఏడాదిలో రూ.2354కోట్లు పంట రుణం అందించాలని నిర్ణయించాయి. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, బ్యాంకు ఉన్నతాధికారులు వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. కాగా కిందటేడాది కంటే పంపిణీ చేయాల్సిన రుణాల శాతం పెరిగినప్పటికీ.. పూర్తిస్థాయిలో రైతులకు అందిచడం లేదు. ఘనమైన రుణ లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలున్నాయి. కిందటేడాది నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 69శాతం మాత్రమే రైతులకు రుణాలు అందించారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం.. కొంతమంది రైతులు మాఫీ కోసం ఎదురుచూడటంతో రెనివల్ చేసుకోలేకపోయారు. కొన్ని బ్యాంకులు కాగితాల్లోనే రుణాలు రెనివల్ చేసి రైతులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ముట్టజెప్పి అక్కడికే పరిమితమయ్యారు. కనీసం వడ్డీ మాఫీ కూడా వర్తించకపోవడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతులకు పెట్టుబడి కోసం ఆర్థిక దన్నుగా నిలవాల్సిన బ్యాంకులు పూర్తిస్థాయిలో భరోసా ఇవ్వడం లేదు. పంట కోసం ప్రతి ఏటా రుణాలు అందిస్తున్నా.. లక్ష్యం మేర పంపిణీ చేయడం లేదు. ఈ ఏడాది రైతులకు అందించాల్సిన రుణలక్ష్యం రూ.2354 కోట్లు కేటాయించారు. కిందటేడాది వార్షిక రుణ లక్ష్యం రూ.2163 కోట్లు కేటాయించినా కేవలం రూ.1494కోట్లు మాత్రమే అందజేశారు. ఈ ఏడాది రుణలక్ష్యం 8.82శాతం పెంచినా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చుతుందా లేదా అనేది అనుమానంగా మారింది. ప్రతి ఏటా మే-జూన్ నెలల్లోనే వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసి పంపిణీ చేయాల్సి ఉన్నా ఆలస్యం జరిగింది. మరోపక్క రుణం కావాలంటే పట్టాపాసు పుస్తకం బ్యాంకులోనే పెట్టాలని షరతు విధించడంతో రైతులు రుణాలు తీసుకునేందుకు విముఖత చూపిస్తున్నట్లు తెలుస్తోంది. పంట రుణం అందించే సమయంలో రైతుల నుంచి పట్టాపాసు పుస్తకాలు తీసుకోకూడదని నిబంధనలు ఉన్నా సంబంధిత బ్యాంకు అధికారులు వాటికి తిలోదకాలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిణామాలపై ఉన్నతాధికారులు సైతం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

సామాన్యులకు అందని సాయం..!

బ్యాంకులు వివిధ ప్రాధాన్య రంగాలకు కూడా రుణాలు అందించేందుకు వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించాయి. ఈ ఏడాది ప్రాధాన్యత రంగాలకు రూ.4218కోట్లు అందజేయనున్నట్లు నిర్ణయించారు. ఎంఎస్‌ఎంఈ సెక్టార్, విద్యా, గృహనిర్మాణ రుణం, రెనివేబుల్ ఎనర్జీ, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వాల్వింగ్ రంగాలకు అందించేందుకు వీటిని కేటాయించారు. కిందటేడాది ఈ రంగాలకు రూ.3776 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 11.68శాతం అధికంగా పెంచింది. కానీ ఆయా రుణాలు అందించడంలో వివిధ రకాల కొర్రీలు పెడుతుండటంతో సామాన్యులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. వివిధ బ్యాంకులు షరతులు లేనిదే రుణాలు ఇవ్వకపోవడంతో పేదలకు ఆర్థిక సాయం దరిచేరడం లేదు. ఆయా బ్యాంకుల్లో డబ్బులు జమ ఉన్న వారికి..రాజకీయ అండదండలు కలిగిన వారికి మాత్రమే రుణాలు అందించడంలో ప్రాధాన్యం లభిస్తోందనే వాదనలు ఉన్నాయి. వివిధ సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం పొందడానికి అనేక మంది లబ్దిదారులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఫలితంగా ఆయా రుణాలు తమకు దక్కవనే అసహనంతో బ్యాంకుల వైపు వెళ్లేందుకే జంకుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు పేదలు, అన్నదాతలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్యాంకులు చేరువ కావాలని పేదలు కోరుతున్నారు.

వందశాతం లక్ష్యం చేరుకుంటాం : భాస్కర్ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్, ఆదిలాబాద్

కిందటేడాది రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు రుణాలు చెల్లించలేకపోయారు. దీంతో వార్షిక రుణ లక్ష్యం చేరుకోవడంలో కొంత వెనుకబడాల్సి వచ్చింది. ప్రభుత్వం ఈ ఏడాది రుణమాఫీ చేస్తామని భరోసా ఇవ్వడంతో నిర్దేశించిన రుణాలను లబ్దిదారులకు అందించి వందశాతం లక్ష్యం చేరుకునేందుకు కృషిచేస్తాం.

అటవీ రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- సీసీఎఫ్ వినోద్‌కుమార్



నవతెలంగాణ - దహెగాం

అటవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీసీ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రపెల్లి, కొంచవెల్లి ప్లాంటేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణతో పాటు అటవీ జంతువుల సంరక్షణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాంటేషన్‌ల నిర్వహణలో అధికారుల పనితీరును మెచ్చుకున్నారు. ఆయన వెంట ఆసిఫాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, రెబ్బెన ఎఫ్ఆర్ఓ అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధరచారి, ఎఫ్ఎస్ఓ సతీష్, రవి, బాబు, బీట్ ఆఫీసర్లు సద్దాం, మధుకర్ ఉన్నారు.

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ



నవతెలంగాణ-జన్నారం

గొల్ల, కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార యూనియన్ చైర్మన్ డాక్టర్ కొమ్ము అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గొర్రెల పెంపకదారుల సహకార యూనియన్, డైరెకర్స్ గట్టు మహేష్, పిండి నరేష్, యాదగిరి, తిరుపతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ మాట్లాడారు. గొర్రెలు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులపై గొర్రెల మేకల పెంపకదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు అందించే సలహాలు సూచనలు పాటించాలన్నారు. అనంతరం జిల్లా చైర్మన్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి గ్రామాల్లోని యాదవులకు గొర్రెల పంపిణీని చేస్తుందన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ త్వరలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల యాదవులు వంగ శ్రీనివాస్, సురక్షిని, గొట్ల గోపాల్ పాల్గొన్నారు

మధుమేహం, రక్తపోటుపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో గురువారం శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మధుమేహం, రక్తపోటు లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మధుమేహం, రక్తపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్య ఇస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత అత్యవసరమని తెలిపారు. డాక్టర్ సలహాలు, సూచనలు పాటించాలని, మద్యపానం, ధూమపానం అతిగా తీసుకోకుండా కూరగాయలకు, పండ్లకు ప్రాముఖ్యత ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గని మేనేజర్ తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి నర్సయ్య, పిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, సర్వే అధికారి వర్మ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన



నవతెలంగాణ-కోటపల్లి

రైతులకు క్రిమి సంహారక మందులపై గురువారం ఎఫ్ఎంసి కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని జనగామ, ఆలుగామ, సుపక రైతులతో జనగామ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా మార్కెటింగ్ మేనేజర్ మణిచందర్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన మందులను వాడటం వల్ల పంట దిగుబడి పొందవచ్చన్నారు. మార్కెట్‌లో నాణ్యత లేని కంపెనీ మందులు వాడి మోసపోవద్దని తెలిపారు. ఎఫ్ఎంసి కంపెనీ మందులు వాడటం వల్ల రైతులు అధిక లాభాలను పొందవచ్చన్నారు. రైతులెవరూ బయో మందులు వాడొద్దన్నారు. సకాలంలో ఎరువులు, రసాయన మందులు వాడి అధిక దిగుబడి పొందాలన్నారు. అనంతరం జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐ హరినాథ్‌రెడ్డి ఎండిఓ సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చెంచలగూడకు చెందిన వికలాంగుడు కుమ్ర బొజ్జారావుకు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ గురువారం వీల్‌చైర్ అందజేశారు. బొజ్జారావు పుట్టుకతోనే పోలియో బారినపడి రెండు కాళ్లు చచ్చుబడి ఎటూ కదలలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సీఐ, ఎస్ఐ బాధితుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. వీల్‌చైర్‌ను అందజేసిన సీఐ, ఎస్ఐకి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలుడు మృతితో గ్రామంలో విషాదం

- ప్రయివేట్ ఆస్పత్రిలో బంధువుల ఆందోళన
- మిన్నంటిని తల్లిదండ్రులు, అప్పుల రోదనలు





నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇంజక్షన్ వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన కాగజ్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో జరిగింది. విషయం తెలుసుకున్న బాలుని బంధువులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి వచ్చి ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. మృతుని బంధువులు తెలిపిన ప్రకారం..దహెగాం మండలం చౌక పంచాయతీ పరిధిలోని హేటిగూడ గ్రామానికి చెందిన సుకుం సాకేత్(9) ఇదే మండలంలో ప్రయివేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా కండ్ల కలకతో బాధపడుతున్న సాకేత్‌కు గురువారం ఉదయం స్వల్ప జ్వరం రావడంతో తండ్రి ఓదేలు ముందు జాగ్రత్తగా తన ద్విచక్రవాహనంపై కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు గ్లూకోజ్ ఎక్కించాలని సూచించడంతో గ్రామం వెళ్లి గ్లుకోజ్ పెట్టించుకుంటామని తండ్రి తెలుపడంతో యాంటి బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చి పంపిస్తానని వైద్యుడు సూచించాడు. డాక్టర్ చెప్పిన మేరకు నర్స్ బాలునికి ఇంజక్షన్ ఇచ్చే క్రమంలోనే బాలునికి వాంతులు కావడంతో తండ్రి బాలున్ని ఎత్తుకొని బాత్రూం వైపు తీసుకెళ్లాడు. అప్పటికే బాలుని పరిస్థితి విషమించి తండ్రి చేతులోనే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న బాలుని తల్లి శ్రీదేవి హుటాహుటిన ఆసుపత్రికి వచ్చి నిర్జీవమైన బాలుడిని చూసి గుండెలవిసేలా రోదించింది. తన కుమారుడు సాకేత్‌ను డాక్టర్, నర్స్ కలిసి చంపేశారని తండ్రి ఆరోపించడంతో వారి బంధువులు ఆసుపత్రికి వచ్చి ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి వచ్చిన టౌన్ సీఐ బుద్దె స్వామి, ఎస్ఐలు కళ్యాణ్, అంజయ్య, దహెగాం ఎస్ఐ సనత్‌రెడ్డి బాలుని బంధువులతో మాట్లాడారు. రాతపూర్వక ఫిర్యాదు ఇస్తే తాము డాక్టర్‌పై విచారణ జరుపుతామని తెలపడంతో వారు ఫిర్యాదు చేశారు. దీనిపై వైద్యుడు హసీబ్ ఉల్ హక్‌ను వివరణ కోరగా తాను బాలుడిని అడ్మిట్ కావాలని సూచించినట్లు తెలిపారు. వారు వెళ్లిపోతామని తెలుపడంతో యాంటి బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చే క్రమంలోనే షుగర్ లెవల్స్ పడిపోయి బాలుడు చనిపోయాడని తెలిపారు.

స్కూల్‌కు వెళ్తానన్న కుమారుడు..వద్దని ఆసుపత్రికి తీసుకువచ్చిన తండ్రి

రెండు రోజుల క్రితం దహెగాం మండలం ఐనం గ్రామ సమీపంలోని ప్రయివేట్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బాలుడు సాకేత్ గ్రూప్ డ్యాన్స్‌లో పాల్గొని అందరి మన్ననలు అందుకున్నాడు. గురువారం ఉదయం కూడా తాను పాఠశాలకు వెళ్తానని సాకేత్ పట్టుపట్టాడు. సాకేత్ రెండు రోజులుగా నీరసంగా ఉండడం, ఒళ్లు కాస్త వేడిగా ఉండడంతో ఎందుకైనా మంచిదని కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించుదామని తండ్రి ఓదేలు బాలునికి నచ్చజెప్పి బలవంతంగా తన ద్విచక్రవాహనంపై తీసుకొచ్చాడు. తన కుమారుడు చెప్పినట్లుగా పాఠశాలకు పంపినా దక్కేవాడని తండ్రి రోదించడం అందరినీ కలచివేసింది. ఓదేలు-శ్రీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెల తర్వాత కుమారుడు పుట్టడంతో ఆ బాలుడంటే అటు తల్లిదండ్రులకు ఇటు ఇద్దరు అక్కలకు అతనిపై మమకారం ఎక్కువ. అతనికి ఏ కాస్త అనారోగ్యం వచ్చినా తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించేవారని బంధువులు తెలిపారు. ఇద్దరు కూతుళ్లలో పెద్ద కూతురు తొమ్మిదో తరగతి, రెండో కూతురు ఆరో తరగతి చదువుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులు ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. జిల్లాలో 600కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 32 పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా, డీఎస్సీ వేయకుండా నానుస్తూ వస్తోందని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు దిగిడ ప్రకాష్, నవీన్, అంజన్న, ప్రసాద్, ప్రియాంక, వీణ, ప్రశాంతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు యూనిఫామ్, నోట్ బుక్కులు, పుస్తకాలు, మధ్యాహ్నభోజనానికి నిధులు పెంచాలని, మన ఊరు మన బడి పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలని, కాస్మోటిక్ చార్జీల బిల్లులను విడుదల చేయాలని, మండల విద్యాధికారి, ఉపాధ్యాయ పోస్టులను, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 600కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారుతుందని, విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రవీన్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ - హాజీపూర్

రెగ్యులరైజ్ చేయాలని సమ్మెలో భాగంగా గురువారం రెండవ రోజు కాంట్రాక్టు ఏఎన్ఎంలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తామని చెప్పి ఏండ్లు గడుస్తోందన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను రెగ్యులర్ చేయకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను శ్రమ దోపిడీకి గురి చేస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అన్ని రకాల కాంట్రాక్ట్ ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు దుంపల రంజిత్, జిల్లా అధ్యక్షురాలు పద్మ మంజుల, తులసి, రమ, సరిత, సత్యవతి, రాజేశ్వరి, విజయ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రెండో ఎఎన్ఎల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంతో పాటు ఈసీ, అర్బన్ ఆర్బిఎస్కే, 104 సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల అమలులో ముందుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి దివాకర్, రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర నాయకులు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి పాల్గొన్నారు.

సిర్పూర్‌కు సాగునీరు అందించడంలో కేసీఆర్ విఫలం

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ - దహెగాం

సిర్పూర్ నియోజకవర్గానికి సాగునీరు అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా మండలంలోని ఖర్జీ, చిన్నరాస్పెల్లి, రాంపూర్, మొట్లగూడ, రావులపల్లి, గిరవెల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం ఆయకట్టుకు గుండెకాయ లాంటి తుమ్మిహేటి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని, గూడెం, హుడ్కిళి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేయడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కొన్నేండ్లుగా నిర్మాణ దశలోనే ఉందన్నారు. వెంటనే వాటన్నింటినీ పూర్తిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్‌కు సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని, పథకాల ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేసీఆర్ ముందస్తు మద్యం టెండర్లకు పిలుపునివ్వడంలో రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. మిషన్ భగీరథ నీళ్లు మండలానికి రావడం లేదని విమర్శించారు. పేద ప్రజల అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. యాత్ర మార్గమధ్యలో ఒడ్డుగూడ గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హర్షద్ హుస్సేన్, జిల్లా కోశాధికారి రాంటెంకి నవీన్, నియోజకవర్గ అధ్యక్షుడు కొండా రాంప్రసాద్, నాయకులు జిల్లెల తిరుపతి, దేవిదాస్, రోషన్, శంకర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్రిక్తత వాతావరణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన ఓ మహిళ కలెక్టరేట్‌లో హల్‌చల్ చేసింది. తన ఇల్లును కూల్చేయడంతో మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తన ఇంటిని వేరే వారి పేరుపైకి మార్చడమే కాకుండా కూల్చివేయడంతో బీజేపీ నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చింది. మున్సిపల్ కమిషనర్ శైలజను ఈ విషయమై ప్రశ్నించగా ఆమె సమాధానం ఇవ్వలేదు. ఆగ్రహం చెందిన మహిళ కమిషనర్‌ను తోసేసే ప్రయత్నం చేసింది. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కేఆర్కే కాలానికి చెందిన రమేష్ ఇంటిని మున్సిపల్ అధికారులు వేరే వాళ్ల పేరు మీదకి మార్చడమే కాకుండా గురువారం జేసిబితో కూల్చేశారు. మున్సిపల్ కమిషనర్ శైలజ కలెక్టరేట్‌లో ఉందన్న విషయం తెలుసుకొని బీజేపీ నాయకులతో కలిసి అక్కడికి వెళ్లి ప్రశ్నించింది. ఆమె సమాధానం ఇవ్వకపోవడంతో మహిళ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగింది. ఇదంతా కలెక్టర్ ఛాంబర్ ఎదుటే జరిగింది. అనంతరం కలెక్టర్ వారిని ఛాంబర్‌లోకి పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ పట్టణం కబ్జాదారులకు అడ్డగా మారిందని ఆరోపించారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ - కాసిపేట

జిల్లాకు నూతనంగా వచ్చిన అడిషనల్ కలెక్టర్ సభావత్ మోతీలాల్ నాయక్‌ను సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సోమగూడెం(కె) సర్పంచ్ సపాట్ శంకర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుడిపేట ఎస్ఐ ఇస్లావత్ ప్రకాశ్, లాలునాయక్ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



వర్షానికి కొట్టుకుపోయిన రోడ్లను మరమ్మతులు త్వరలో పూర్తిచేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండలంలోని బోస్రా గ్రామ సందర్శనలో భాగంగా మండలానికి వచ్చే ప్రధాన రహదారి వర్షానికి కోతకు గురవడంతో ఆర్ అండ్ బి అధికారులకు తెలియజేసి రెండు రోజుల్లో రోడ్డు పరిశీలించి, మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరమో తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, నాయకులు కుడారి నరేష్, సాయి చైతన్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్‌ను సన్మానించిన పీహెచ్‌సీ సిబ్బంది

నవతెలంగాణ-బాసర



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన స్టాఫ్ నర్స్ శరణ్యను గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆకాష్, సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇటీవలే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన శరణ్యను మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందజేశారని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో కొనసాగుతన్న బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి దీక్షలు గురువారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బోథ్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూర్చున్నారు. అలాగే రెవెన్యూ డివిజన్ సాధించేవరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు. తరలిపోయిన కార్యాలయాలు వెంటనే తరలిరావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ సంఘీభావం తెలిపారు.

రిమ్మలో ఆదివాసుల జీవన విధానంపై రీసెర్చ్ ప్రోగ్రాం

- పాల్గొన్న ఏడుగురు శిక్షణ ఐఏఎస్ అధికారులు

నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలపై, ఆచార వ్యవహారాలు, జీవన విధానం గురించి తెలుసుకోవడానికి శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు మండలంలోని రిమ్మ గ్రామానికి రానున్నట్టు సర్పంచ్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు, ఏడుగురు శిక్షణ ఉన్నతాధికారులు ఆదివాసీల జీవితాలపై, జీవనోపాదులపై రీసెర్చ్ ప్రోగ్రాం చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని సామాజిక, ఆర్థిక, జీవిత, వాస్తవాల పట్ల, అట్టడుగు వర్గాల సమస్యలపై ట్రైనీ అధికారులకు అవగాహన కల్పించడం ఈ రీసెర్చ్ ముఖ్య ఉద్యేశమని అన్నారు.

టీఎన్జీఓ సభ్యత్వ నమోదు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ టీఎన్జీఓ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సహకార శాఖ ఉద్యోగులకు సభ్యత్వ నమోదు చేసి రసీదులను అందజేశారు. సహకార శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి శాఖలోని ఉద్యోగులు తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు తిరుమల్‌రెడ్డి, సహకార శాఖ ఉద్యోగులు విక్రాంత్, నయీం, సంజయ్, నరేష్, కృష్ణారెడ్డి, అమ్రేష్, మహిళ ఉద్యోగులు లక్ష్మి, ఆశ జ్యోతి, రజిత, కృష్ణవేణి, శశికళ పాల్గొన్నారు.

నాటు పడవపై వెళ్లి విద్యుత్ టవర్ పనుల పరిశీలన

- విద్యుత్ శాఖ ఎస్ఈ జెఆర్ చవాన్



నవతెలంగాణ-కడెం

మండలంలోని గంగాపూర్, దేవునిగూడెం గ్రామానికి కడెం నది నుంచి నాటు పడవపై నిర్మల్ విద్యుత్ శాఖ ఎస్ఈ జెఆర్ చవాన్, నిర్మల్ విద్యుత్ శాఖ డీఈ నాగరాజు, ఖానాపూర్ ఏడీఈ శ్రీనివాస్‌లు గురువారం పర్యటించారు. గంగాపూర్ గ్రామ సమీపంలోని కడెం నది వంతెన సమీపంలో నిర్మాణం చేపడుతున్న విద్యుత్తు టవర్ పనులను ఎస్ఈ జెఆర్ చావాన్ పరిశీలించారు. పనులను నాణ్యతగా వేగవంతంగా చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు.

ముందుండి సేవలు అందిస్తాం



నవతెలంగాణ-నార్నూర్

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ముందుండి సేవలు అందిస్తామని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని మల్లంగి గ్రామంలో దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఇప్పటి నుంచి జిల్లా ముఖ్యనాయకులను పిలిపించి సమావేశం నిర్వహించి, మండలంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఫౌండేషన్ ముందుండి ఆదుకుంటుందని భరోసా కల్పించారు. రాబోయే కాలంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు విస్తృతస్థాయిలో ప్రజలలో చేరుతాయని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులతో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్ల మీద కూర్చొని రెండో ఏఎన్ఎంల నిరసన

- రెగ్యులర్ చేయాలని డిమాండ్
- 3వ రోజుకు చేరిన సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా సమ్మె గురువారంతో మూడవ రోజుకు చేరుకోగా మోకాళ్ల మీద కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టులను భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వము గుర్తించి యథావిధిగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, ఏఎన్ఎం నాయకులు పుష్పాల, విజయలక్ష్మి, ఆనందబాయి పాల్గొన్నారు.



నియంత పాలనకు చరమగీతం పాడాలి

- ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికి బ్రోకర్లగా మారారు
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన ఈటల రాజేందర్



నవతెలంగాణ-నిర్మల్


కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో తన నివాసంలో చేపట్టిన అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ ఆమరణ నిరాహార దీక్షకు బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని, జీఓ 220ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వచ్చాక కొత్తరూపం ఎత్తారని, ప్రభుత్వ భూములు అమ్ముకొని బ్రోకర్‌గా మారారని అన్నారు. జోన్ కన్వర్ట్ చేయడం, అసైన్డ్ భూములు లాక్కోవడం, పరిశ్రమల పేరుతో భూములు సేకరించడం పేరుతో కేసీఆర్ భూములు పేదవారి చేతిలో లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. భూప్రక్షాలన, ధరణి తీసుకువచ్చి వేల ఎకరాల అన్ ఐడెంటిఫీడ్ లాండ్‌లను కేసీఆర్ బినామీ పేర్లకు మార్చుకున్నారని అన్నారు. లక్షల కోట్ల భూకుంభకోణం చేస్తున్నారని విమర్శించారు. నిర్మల్ పురాతన పట్టణం ఎన్నో ఏండ్ల కిందనే సోఫీనగర్ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ జోన్‌గా ప్రకటించారని, ఇప్పుడు అక్కడ పరిశ్రమలు మూతపడటంతో ఆ భూములు అమ్ముకోలేరని వారిని భయపెట్టి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, తన అనుచరులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారని అన్నారు. భూములు వారి చేతుల్లోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతాన్ని రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్‌గా మార్చారని అన్నారు. గ్రీన్ జోన్‌లోనున్న మంజులాపూర్, తల్వెద గ్రామాలను ఇండస్ట్రియల్ జోన్‌గా మార్చి మట్టిని నమ్ముకొని బతుకుతున్న రైతుల కండ్లలో మట్టి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కండ్లల్లో మట్టి కొట్టే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ మేరకు మహేశ్వర్‌రెడ్డి నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. రింగ్ రోడ్డు ఎటు వస్తుందో తెలుసుకొని రైతుల దగ్గర ముందే తక్కువ ధరకు కొనుక్కొని రైతులను మోసం చేసి, బీఆర్ఎస్ నాయకులు బాగుపడుతున్నారని అన్నారు. గ్రీన్ బెల్ట్, కన్సర్వేషన్ జోన్‌లో ఉన్న భూములను కన్వర్ట్ చేసుకొని కోట్లు సంపాదిస్తున్నారని అన్నారు. మాస్టర్ ప్లాన్ పేరిట రైతుల భూములు లాక్కుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువచ్చేది ప్రతిపక్షాలని, ప్రజలకు విశ్వాసం కలిగించేది మేమనని అన్నారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం నిజాం సర్కార్ లాగా వ్యవహరిస్తూ, నేను యజమానినీ ప్రజలు జీతగాళ్లు అన్నట్టు ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ చుట్టూ 5వేల 800 ఎకరాలు పేదలకు ఇచ్చిన భూములను కేసీఆర్ లాక్కున్నాడని అన్నారు. ఈ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారిందని విమర్శించారు. నిర్మల్‌లో పెద్ద పరిశ్రమలు వచ్చే అవకాశం లేదని, వచ్చినా పరిశ్రమలు పెట్టుకొనే వారు భూములు కొనుక్కుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తే రెండు రోజుల ముందు, కేటీఆర్ వస్తే 24 గంటల ముందు, మంత్రులు వస్తే పొద్దున్నే ప్రతిపక్షాల నాయకులను అరెస్ట్ చేయడం నిత్యం కార్యం అయ్యిందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, నిరసన తెలిపే హక్కు కాలరాస్తున్నారని అన్నారు. పౌరుల స్వేచ్ఛను బంగ పరుస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం నిర్మల్ బంద్‌కు పిలుపునిస్తున్నట్టు నాయకులు వెల్లడించారు. ప్రజలు వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రామారావు పటేల్, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రామనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు
- కార్యకర్తలకు కుచాడి శ్రీహరిరావు దిశా నిర్దేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు అన్నారు. గురువారం మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్ గుండం శ్రీనివాస్, 30 మంది కార్యకర్తలు, బాబాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తునికి నారాయణ, 20 మంది కార్యకర్తలు, నర్సాపూర్, కాశిగూడ గ్రామాలకు చెందిన 40 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వీరందరికి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యకర్తలు, కష్టపడి పని చేయాలని, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, రామిరెడ్డి, కోమటి రమణ, నర్సయ్య, సాయన్న, విజయ్, కోమటి మహేష్, జడ్డి అజయ్ పాల్గొన్నారు.



పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి 9 యేండ్లు గడిచిందని, ఇప్పటి వరకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన దాఖలు లేవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. గురువారం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మావల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలను నిర్వహించిన ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. పేదలకు మోసం జరిగితే ఉరుకునే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలని తెలంగాణలో ఉన్న పేదల బ్రతుకులు మారాలని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేంద్రం వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తే వాటిని దారిమళ్లించారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు సొంత కార్యకలాపాలకు వాడుకుంటుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో పేదలకు ఇండ్లను ఇవ్వకపోతే పెద్ద ఎత్తున జోగు రామన్న ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిరెడ్డి, ఆకంత్ రమేష్, వేణుగోపాల్, రఘుపతి, లోక ప్రవీణ్‌రెడ్డి, జోగు రవి, చిలుకూరి జ్యోతిరెడ్డి, గంగారెడ్డి, సోమ రవి, మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన కాకెర్ల ప్రశాంత్ ఉపసర్పంచ్ తండ్రి ఇటీవల పాము కాటుకు గురై మరణించగా విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఈరవేన ఈరన్న తల్లి ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పలువురు కార్యకర్తలు ఉన్నారు.

కడెం : మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన ముదురుకోళ్ల వెంకవ్వ ఇటీవల మరణించగా గురువారం వారి ఇంటికి నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు అజ్మీరా శ్యామ్ నాయక్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బోయిని మహేష్ నానమ్మ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.



బజార్‌హత్నూర్ : మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎర్నాలే సంజీవ్ తండ్రి విశ్వనాథ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వారిస్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భగత్ వినోద్, కోడిమెల గంగయ్యల కుటుంబాలకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, మండల నాయకులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను గురువారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులను టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర శాఖకు తెలియజేసి, వారి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి మురళీధర్, బామర్ల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రిమ్మ గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదిని, విద్యార్థుల గదులను, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఆహారం పెడుతున్నారని, మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ అపరి శుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు సమాధానాలు చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుభ్రతను పాటించాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. అనంతరం తిమ్మపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మూసి ఉండటంతో, స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సదరు టీచర్‌పై చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూఓ సౌజన్య, ఎంపీపీ అమృత్‌రావ్, సర్పంచ్ అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

పీసీసీఎఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కడెం

మండలంలోని లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించుటకు త్వరగా అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని గురువారం హైదరాబాద్ లో తెలంగాణ పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియల్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

ప్రతి పేదవాడికి గృహలక్ష్మీ వర్తింపజేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖాడే విష్ణు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేదవాడికి గృహలక్ష్మీ పథకం కింద ఇండ్లను మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముఖాడే విష్ణు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద దళితులకు దళితబంధు వర్తింపజేయాలని, ప్రతి పేద వాడికి గృహలక్ష్మీ పథకం కింద ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఇటీవల భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్ట పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జితేందర్, బాబాసాహెబ్ ఉన్నారు.

ఫైలేరియా, లెప్రసీ సర్వేను పరిశీలించిన డబ్ల్యూహెచ్ఓ కేంద్ర బృందం

నవతెలంగాణ-కడెం

మండలంలోని కన్నాపూర్, కడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫైలేరియా, లెప్రసీ సర్వేను డబ్ల్యూహెచ్ఓ కేంద్ర బృందం సభ్యురాలు విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించి, ఫైలేరియా కేసుల వివరాలను తెలుసుకున్నారు. సర్వే పట్ల, సంబంధిత వ్యాధిగ్రస్తులకు అందించే మెడిసిన్ పట్ల వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కడెం ప్రభుత్వాస్పత్రి డాక్టర్ శివకుమార్, ఆస్పత్రి సూపర్‌వైజర్లు గోపాల్, నిర్మల ఎఎన్ఎం రాణి, వైద్య సిబ్బంది అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 18 ఆగస్టు 2023

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ కొరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ -2024 కొరకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ధైర్య సాహసాలు, ఆటలు, సంఘ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం,ఆర్ట్అండ్‌కల్చర్ ఆవిష్కరణలు(ఇన్నోవేషన్) మొదలైన రంగాలలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాల బాలికలకు అందించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డుల (జాతీయ అవార్డు) కొరకు దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. ఈ అవార్డు ల కోసం నామినేషన్స్ ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అప్లికేషన్ ఆన్లైన్ కాపీ, డాక్యుమెంట్స్ జిరాక్స్‌లను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఆగస్టు 31లోపు అందజేయాలన్నారు. వివరాల కొరకు డీసీపీవో ఆనంద్(807402847)ను సంప్రదించాలని తెలిపారు.

గృహలక్ష్మీ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి

నవతెలంగాణ-జన్నారం



గృహలక్ష్మి దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని రొటిగూడ గ్రామపంచాయతీలో జరుగుతున్న గృహలక్ష్మి దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా, తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించి, గ్రామంలోని పల్లె ప్రకృతి వనం,సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటికల నిర్వహణ పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిఓ రమేష్, గ్రామ సర్పంచ్ మల్క విజయలక్ష్మన్, కార్యదర్శి పాల్గొన్నారు.

ఉపరితల గని ప్రదేశాలను పరిశీలించిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని పని ప్రదేశాలను, ఓబీ కాంట్రాక్ట్ కంపెనీ క్యాంప్ కార్యాలయాన్ని డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఓబీ కాంట్రాక్ట్ కంపెనీ వారు రోజువారి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడానికి అన్ని ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. గత నెల వర్షాలతో వెనుకబడిన ఉత్పత్తిని ఆగస్టు నెలలో సాధించాలని, అలాగే కొత్త కాంట్రాక్ట్ కంపెనీ జీవిఆర్ ఓబీ ఉత్పత్తి పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం సివిల్ శివరావు, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తుంపల్లి, గూడెంఘాట్ గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి రెండవ విడత గొర్రెలు పంపిణి చేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ సద్వినియోగం చేసుకొని యాదవులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీకాల పంపిణీలో భాగంగా 450 ఆవులు, ఎడ్లు, బర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, అంకుసాపూర్ సర్పంచ్ బలరాం, పశువైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రేఖల దత్తు, సాయిని రాజశేఖర్, పెద్ద గొల్ల, పశువైద్య సిబ్బంది వినోద్, గజానంద్, పురుషోత్తం, అర్జున్, గొర్రెల యూనిట్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందని దందిరె రాజన్న బుధవారం పాము కాటుతో మృతి చెందగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం మండల కేంద్రంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా సోషల్ మీడియా కమిటీలు

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ గ్రామ పంచాయతీల వారీగా సోషల్ మీడియా కమిటీలను నియమిస్తోంది. మండల పార్టీ అధ్యక్షులు బలమూరి అరవింద్‌రావుతో కలిసి బీఆర్ఎస్ నాయకులు గురువారం వివిధ గ్రామాలలో సోషల్ మీడియా కమిటీలను నియమించింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు వెంట్రావ్‌పల్లి, దుబ్బపల్లి, ముదిగుంట, కానుకూరు, మిట్టపల్లిల్లో సోషల్ మీడియా బాధ్యతలకు నియామక పత్రాలు అందజేసినట్లు నాయకులు తెలిపారు.

20న ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ - కాసిపేట

ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం కాసిపేట గనిపై పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 20 ఆదివారం ఉదయం 10 గంటలకు వైష్ణవి ఫంక్షన్ హాల్లో మహాసభలు జరుగుతాయని, సభలకు ముఖ్య అతిథులుగా వాసిరెడ్డి సీతారామయ్య, మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య పాల్గొంటారన్నారు. అనంతరం బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, మీనుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 19న 5కే రన్‌ను నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్టాండ్ సర్కిల్ నుండి రుద్రారం రైస్‌మిల్ వరకు ఉదయం 6 గంటలకు రన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరితో పాటు ఓటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ జేఈకి ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలం విద్యుత్ జేఈగా బాధ్యతలు చేపట్టిన లచ్చన్నను గురువారం తపాలాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు గుంటుకు తిరుపతి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చిన్ననాటి మిత్రుడైన లచ్చన్న కడు పేదరికంలో ఉండి కష్టాలను ఎదుర్కొని ఉన్నత చదువులు చదువుకొని జేఈగా మండలానికి రావడం చాలా సంతోషకరమన్నారు. మండల ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందితో జనవరి నుండి జూన్ వరకు స్టేషన్ల వారీగా నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు పరిశోధనలోనూ సాంకేతిక పరిజానం ఉపయోగిస్తూ నేరస్థులకు శిక్ష పడేలా చూడాలన్నారు. వృత్తి నైపుణ్యత, శాస్త్రీయ పరిశోధనలో నిష్ణాతులు కావాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేసి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రొయాక్టీవ్(క్రియాశీలకం), ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా నివారణకు కృషి చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కా, పేకాట, గుడుంబా, మట్కా వంటి చట్ట వ్యతిరేకమైన కార్యాకాపాలపై నిఘా ఉంచి అక్రమ రవాణా, సరఫరా చేయడం వంటి విషయాలపై పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఎస్సై ఎస్.వెంకటేష్, కౌటాల పీఎస్ హెడ్ కానిస్టేబుల్ డి.బాబాజీ, సిర్పూర్(టి) పీఎస్ ఎండి అసిముద్దీన్‌కు నగదు రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) అచ్చేశ్వరరావు, ఆసిఫాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్, కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్, ఎస్‌బి సిఐ రాణాప్రతాప్, డిసిఆర్‌బి సిఐ రమేష్, సిసిఎస్ సిఐ ముత్యంరాజు, డిపిఓ ఎఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-దహెగాం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడిచిపోతున్నా విద్యార్థుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంభిస్తోందన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందజేయాలని, మధ్యాహ్న భోజనం నిధులను విడుదల చేయాలని, ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితీష్ పాల్గొన్నారు.

టెండర్లపై విజిలెన్స్ విచారణ చేయించాలి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో గతంలో జరిగిన డిజిల్ కుంభకోణం కంటే, కన్వెయిన్స్ డ్రైవర్ల టెండర్లు కుంభకోణం చాలా పెద్దదని, దీనిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపించాలని ఎస్సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అకారణంగా తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి డబ్బులు కష్టపడే కార్మికునికి, భూ నిర్వాసితులకు చెందకుండా బినామీ ఓనర్ల జేబుల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఈ విషయం బహిరంగంగా చర్చించుకుంటున్న కూడా సింగరేణి అధికారులు, విజిలెన్స్ విభాగం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. భూ నిర్వాసితులకు చెందాల్సిన టెండర్లను బినామీలు చేజిక్కించుకొని అయిమాయిషి చెలాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, విజిలెన్స్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, లేని యెడల పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించి బినామీ ఓనర్ల కుంభకోణాన్ని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు.

అటవీశాఖ అనుమతులపై మంత్రి నిర్లక్ష్యం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ జాతీయ రహదారి 63 రోడ్డు విస్తరణకు అటవీశాఖ అనుమతులపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ కో ఆర్డినేటర్ నయీమ్ పాషా ఆరోపించారు. గురువారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచి దాదాపుగా మూడు నెలలు అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన జాతీయ రహదారి పనులు నిలిచిపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని వాపోయారు. సదరు కాంట్రాక్టర్ అటవీశాఖ అనుమతులు లేకుండానే విస్తరణ పనులు చేపట్టడంతో అతనికి సంబంధిత అధికారులు జరిమానా విధించారని పేర్కొన్నారు. జరిమానా విధించడంలో కూడా అధికారుల నిర్లక్ష్యం ఉందని, కాంట్రాక్టర్కు విధించాల్సిన రూ.2.5 కోట్లకు బదులుగా రూ.3 లక్షలు మాత్రమే విధించారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే సంబంధిత మంత్రి, అధికారులు చొరవ తీసుకొని అనుమతులు ఇచ్చి జాతీయ రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కే.రాజేందర్, యువజన విభాగం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నస్పూర్ మండల కోఆర్డినేటర్ సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్



నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన మండలంలో చాలా వరకు దిగువ, మధ్యతరగతి వారే ఉన్నారన్నారు. ఇక్కడ ఇంటర్ మీడియట్ వరకే ఉందని, ఉన్నత చదువులు చదవాలంటే కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సిందేనని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని వారు ప్రయివేటు కళాశాలల్లో చదువుకొనే స్థాయి ఉండదని, ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా మహాత్మా జ్యోతిబాపులే రెసిడెన్సియల్ పాఠశాల, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు గడ్డల సాయికిరణ్, యువ నాయకులు నితిన్, సాయి, ఆడె సాగర్ పాల్గొన్నారు.

బీఎస్‌పీ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - సిర్పూర్(టి)

బీఎస్‌పీ పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడే పార్టీ అని, రాబోయే కాలంలో బీఎస్‌పీ అధికారం చేపట్టిన తర్వాత ప్రజల అభివృద్ధికి అనేకం సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తుందని రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నూతన కమిటీని రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శిగా గెడం నగేష్, ఉపాధ్యక్షులుగా కర్నె శ్రీకాంత్ పటేల్, రవీందర్ యాదవ్, కోశాధికారిగా కొండగొర్ల మారుతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దుర్గం రజినీకాంత్, కార్యవర్గ సభ్యులుగా ఉషాతేజ్, నక్క భీంరావు, ఎండీ సైఫ్, రవీందర్, మండల సలహాదారుగా గైక్వాడ్ చొక్కారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో బీఎస్‌పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పీఓ ఆశ్రమ పాఠశాలల తనిఖీ

- ఉపాధ్యాయులపై ఆగ్రహం



నవతెలంగాణ - బెజ్జూర్

ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెజ్జూర్, సలుగుపెల్లి, సోమిని, కుంటలమానేపల్లి ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా విద్యను బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెజ్జూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆశ్రమ పాఠశాల వంట గదిని పరిశీలించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మారుబాయి ఉన్నారు.

19న హైదరాబాద్‌లో మహాధర్నా



నవతెలంగాణ-భీమారం

ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల సాధనకు ఆగస్టు 19 శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే తపస్ ఆధ్వర్యంలో మహాధర్నాకు తరలి రావాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, బీమనాధుల మహేశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలైన పాఠశాలలో స్కావెంజర్ల నియామకం, పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం వంటి సమస్యలతో పాటు ఉపాధ్యాయ పదోన్నతులు బదిలీలు, పండిత్, పీఈటీల ఉన్నతీకరణ, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

మోడల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ, సైబర్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలపై సిఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు ఉమెన్ సేఫ్టీ, షీ టీమ్స్ ఉపయోగాలు తెలిపారు. తాత్కాలిక ఆనందాలు, ప్రలోభాలకు, ఆకర్షణలకు గురై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, విద్యార్థి దశ నుంచే మంచి లక్ష్యాలు అలవర్చుకొని పట్టుదలతో కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకోవాలని పేర్కొన్నారు. చదువు వల్లనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని సూచించారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని తెలిపారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రకుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు కాంగ్రెస్ పాదయాత్ర



నవతెలంగాణ - కాసిపేట

మండలంలో పల్లెపల్లెకు కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగుతోంది. ఏఐసీసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ ఆదేశాల మేరకు 5వ రోజు గురువారం కోమటిచేను నుండి పాదయాత్ర ప్రారంభం చేసి రేగుల గూడెం, చిన్న ధర్మారం, పెద్ద ధర్మారం, ముత్యంపల్లి మీదుగా సాగింది. కాసిపేటలో బస చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సర్పంచ్ వేముల కృష్ణ, నియోజకవర్గం నాయకులు రాష్ట్ర మహిళా కార్యదర్శి రొడ్డ శారద, నాతరి స్వామి, బెల్లంపల్లి మండల సీనియర్ నాయకులు రొడ్డ శ్యాం, కాసిపేట మండల మాజీ అధ్యక్షులు సిద్ధం తిరుపతి, మాజీ సర్పంచ్ జాడి శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, సీనియర్ నాయకులు కనక రాజు, మడావి వెంకటేష్, మైదం రమేష్, అచ్యుత్‌రావ్, కొడప అనంతరావ్, ధూడం మహేష్ పాల్గొన్నారు

మీ సేవా కేంద్రాల్లో అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని మీసేవ కేంద్రాల్లో జారీ చేసే సర్టిఫికెట్స్‌కు అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్ని మీసేవ సెంటర్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మీసేవ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మీసేవ నుండి జారీ చేసి సర్టిఫికెట్స్‌కు అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ భానుచందర్, మీసేవ నిర్వాహకులు గోనె సత్యం, గుండ పవన్‌కుమార్, ఇమ్రాన్, భానుచందర్, మౌలానా పాల్గొన్నారు.



డీటీసీని కలిసిన డిప్యూటీ ఆర్ఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్ ఎస్ ప్రణీత్ గురువారం జిల్లా ఉప రవాణా అధికారి డాక్టర్ పుప్పాల శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఆర్టీసీ బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచాలని అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించాలని అన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అర్లి(కె) గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్లి(కె) గ్రామానికి చెందిన దాసరి స్వామి(26) యువకుడు కడుపునొప్పి భరించలేక బుధవారం ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గత ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండగా బుధవారం కడుపునొప్పి అధికమవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని బహుజన జాగృతి సేన సభ్యులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేఎస్ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగం, డీటీ అమృత్ లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా డిగ్రీ కళాశాల లేని మూలంగా విద్యార్థులు పైచదువులకు ప్రయివేటు డిగ్రీ కళాశాలలో చదువుకునే స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీలో గిరిజన ఆదివాసీ దళిత బలహీన వర్గాల విద్యార్థుల కోసం త్వరితగతిన డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. గాంధీ చౌక్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల అపరిశుభ్రతగా మారిందన్నారు. పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, పిచ్చి మొక్కలు పెరిగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సంయుక్త కార్యదర్శి జి.కిరణ్, కమిటీ సభ్యులు సోయం రవీందర్, సాయి కిరణ్, ఆత్రం జంగు, సుర్పం ఆకాశ్, తుమ్రం సంతోష్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నిర్మల్



గత 20 సంవత్సరాలుగా మెప్మాలో పనిచేస్తున్న సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 14న ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ వర్తింపచేసింది. దీంతో మెప్మా సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి వారి కుటుంబ సభ్యుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం మంత్రి నివాసంలో పాలాభిషేకం నిర్వహించారు. మంత్రిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ సుభాష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ మంచి పని మా సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఇలాంటి ప్రభుత్వాలు చిరకాలం అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. గత 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న మెప్మా సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచిందని కొనియాడారు. సహకరించిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, ఎండీ మెప్మా, ఎండీ రెరా చైర్మెన్‌గా ఉన్న డాక్టర్ సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కౌట(బి)తో పాటు ఆయా గ్రామాల్లోని అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు. కౌట(బి) గ్రామానికి చెందిన ఇత్తెడి నర్సమ్మ, అలాగే మాజీ వీడీసీ అధ్యక్షుడు సింగడి జనార్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చింతలబోరి గ్రామానికి చెందిన కాంబ్లే రాకేష్, యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఎఎంసీ చైర్మెన్ రుక్మన్ సింగ్, సర్పంచ్ గంగయ్య, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, ఆత్మ చైర్మెన్ సుభాష్, బోథ్ సర్పంచ్ సురేందర్, వైస్ ఎంపీపీ లింబాజీ, లైబ్రరీ డైరెక్టర్ రమణగౌడ్, నాయకులు రమణ, మెడిచేల్మ ప్రవీణ్, పొచ్చన్న, పోశెట్టి, సోమన్న, రమేష్ పాల్గొన్నారు.

నిర్మల్ శివారు ప్రాంతంలో చిరుత కలకలం

- భయాందోళనలో కాలనీవాసులు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ శివారు ప్రాంతమైన విశ్వనాథ్‌పేట్, బంగాల్‌పేట్ వెళ్లే రహదారి అటవీ ప్రాంత సమీపంలో చిరుత పలువురికి కనబడి కలకలం రేపిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ శివారు ప్రాంతమైన విశ్వనాథ్‌పేట్, బంగాల్‌పేట్ కాలనీలో కలుపుతూ రహదారికి అవతలి వైపు అటవీ ప్రాంతం ఉంది. తరచూ వాహనాల రాకపోకలు కొనసాగుతూ ఉంటాయి. ఈ మేరకు బుధవారం రాత్రి రహదారి వెంట వెళ్తున్న పలువురికి చిరుత కనిపించింది. దీంతో వాళ్ళు భయభ్రాంతులకు గురై చుట్టుపక్కల కాలనీవాసులకు ఈ విషయాన్ని చేరవేశారు. సమీప చెట్లపైకి చిరుత ఎక్కిన దృశ్యాలను వీడియోలు సైతం తీశారు. దీంతో సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్‌గా మారింది. ఈ మేరకు విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని, చిరుత సంచార అడుగుజాడలను నిఘా వేశారు. సాధారణంగా చిరుతలు అటవీ ప్రాంతంలోనే ఉంటాయని, దారి తప్పి కాలనీ వైపు వచ్చి ఉండొచ్చని అటవీ అధికారులు తెలిపారు. కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, తమ పశువులను సైతం అటువైపు తీసుకు వెళ్లొద్దని సూచించారు. త్వరలోనే చిరుత సంచార ఆచూకీ తెలుసుకుంటామని, గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

రెండో ఏఎన్ఎంలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెండో ఏఎన్ఎంలను యథావిధిగా వారి స్థానాలలో వారిని పర్మినెంట్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. గురువారం ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. నోటిఫికేషన్ నెం 02/2023ను రద్దు చేయాలని అన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం చెల్లించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం ఉండదని, మొత్తం అందరిని రెగ్యులరైజేషన్ చేస్తామని ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ వాగ్దానం చేసి మర్చిపోయాడని అన్నారు. ఇప్పటికైనా వారి డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు.

పల్లెపల్లెకు కాంగ్రెస్



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రతి పల్లెలో ప్రతి గడపగడపకు కాంగ్రెస్ పార్టీని చేర్చాలనే ఉద్దేశంతో టీపీసీసీ సభ్యులు బోథ్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ వెన్నెల అశోక్ కాంగ్రెస్ డిక్లరేషన్‌లను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. గురువారం మండలంలోని గెర్జం, చించోలి, సల్యాదా, ధర్మపురి, జల్దా, నవేగావ్, కోమటిగూడ, గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన రైతు, యూత్ డిక్లరేషన్‌లో పొందుపరచిన హామీలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మీ గూడెలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. వైద్య సదుపాయం అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, రజావలి, షేక్ ఇమామ్, రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, లచ్చన్న, కళా రవి, కృష్ణ, శ్రీధర్, రమేష్, జగదీష్, బూర్గుల మల్లేష్, పడిగెల రమేష్, గంగారాం, భూమన్న, కిష్టన్న, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్



నవతెలంగాణ-తలమడుగు

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, రైతుబంధు నాయకుడు, గోక జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో రైతు వేదిక వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత 2018 డిసెంబర్ 11 నాటికి రాష్ట్రంలో లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులందరికి రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ నిలబెట్టారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం. 99వేల 999 రూపాయల వరకు బ్యాంకులకు రైతుల తరఫున బకాయిలను చెల్లించిందని అన్నారు. ఏదేమైనా రైతులను అప్పుల బాధల నుంచి విముక్తి చేయాలని సంకల్పించిన సీఎం కేసీఆర్ ఆర్థిక సంక్షోభ సమయంలోనూ రుణమాఫీ చేపట్టి ఆదుకున్నారని అన్నారు. కేవలం పదిరోజుల్లోనే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేశారని అన్నారు. మొదటి నుంచి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు తలమడుగు మండల ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు జనం జేజేలు పలుకుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రైతు ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ తొమ్మిదేండ్ల పాలనలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేసిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసిన రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలోనే విద్యుత్తు రంగంలో నవశకం మొదలయ్యిందనే విధంగా వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తోందని అన్నారు. అదేవిధంగా రైతుబంధు, రైతుబీమా పథకాలతోపాటు లక్ష రుణమాఫీని పూర్తి చేసిన ప్రభుత్వం, మరోసారి రైతుబాంధవుడిగా నిలిచారు. రైతు సంక్షేమ ప్రభుత్వంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతారెడ్డి, రైతు నిమ్మల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీపూర్ సర్పంచ్ రాజేశ్వర్, రత్నపూర్ సర్పంచ్ రాంబాయి, ఉండం సర్పంచ్ నర్సింలు, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, గంగాధర్, లక్ష్మణ్, దూస సంతోష్, మల్లేష్ యాదవ్, జావిద్, పల్లవి, కిషన్. పోచ్చన్న, గజానంద్, సీనియర్ నాయకులు ఆశన్న యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అసత్యప్రచారాలు సరికాదు

- మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ మాస్టర్ ప్లాన్‌పై ఏ మాత్రం అవగాహన లేకుండా ఇష్టారీతిన మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అసత్యప్రచారాలు చేయటం సరికాదని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 220 జీఓ ప్రకారం మాస్టర్ ప్లాన్ ఆమోదించారని చేస్తున్న ఆరోపణలు, ఆధారాలతో రుజువు చేస్తే నా పదవికి రాజీనామా చేయటానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆధారాలతో రుజువు చేయని యెడల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటావాని సవాల్ విసిరారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని మహేశ్వర్‌రెడ్డి ఆమరణ నిరాహారదీక్ష చేయటం ఇది ఎన్నికల స్టాంట్ మాత్రమేనని అన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రక్రియ పూర్తి అయిపోయిందని, రైతులకు, ప్రజానీకానికి నష్టం జరుగుతుందని, ప్రజలందరిని అసత్యప్రచారాలతో మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, రైతులు, ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదనలు అన్ని పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్తున్నామని అన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలు ప్రజలు ఎవ్వరు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. మంజులాపూర్, తల్వాదా ప్రాంతం ఇండస్ట్రీయల్ జోన్‌లో పడిందని, రైతులకు ప్రజానీకానికి నష్టం కలగకుండా కమర్షియల్, రెసిడెన్షియల్‌లో మారుస్తున్నామని అన్నారు. అవేవిధంగా తల్వేద, విశ్వనాథ్‌పేట్ 200 ఫిట్ రోడ్, బంగాల్‌పేట్ 100 ఫిట్ రోడ్డును మార్పు చేస్తున్నామని అన్నారు. మహేశ్వర్‌రెడ్డికి ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి, తను రాజకీయంగా లబ్ది కొరకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిర్మల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాస్టర్ ప్లాన్ మార్చే అవకాశం ఉన్న గాలికి వదిలేశారని అన్నారు. ప్రస్తుతం నిర్మల్ ప్రజల మేలు కొరకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, రాబోయే రోజుల్లో ఓటమి తప్పదని భావించి చీటికీ మాటికి మంత్రి ప్రజలని మోసం చేస్తున్నారని, అవినీతికి పాల్పడ్డారని విమర్శించటం సరికాదన్నారు. మంత్రిపై ఆరోపణలు మోపి ఉనికిని చాటుకొనే ప్రయత్నం చెయొద్దని అన్నారు. నిర్మల్ జిల్లా సాధకుడు, సమీకృత కలెక్టరేట్, మెడికల్ కళాశాల, జిల్లా ప్రధాన ఆస్పత్రి, ఇలా చెప్పుకుంటూ వెళ్తే నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఎన్నెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ఉన్న ప్రజా నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి అని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక రాబోయేది ఎన్నిక సమయం కావటంతో దిగజారుడు తనంతో మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయని అన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్, నిర్మల్ ఎమ్మెల్యేగా మళ్లీ ఇంద్రకరణ్‌రెడ్డి గెలిచి మంత్రిగా కొనసాగుతారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌లు లక్కాకుల నరహరి, గండ్రత్ రమణ, అబ్దుల్ మతిన్, బిట్లింగ్ నవీన్ పాల్గొన్నారు.

సోషల్‌వెల్ఫేర్ పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. బోర్డుపై లెక్కలు చేస్తూ గణితంలో రాణించేందుకు చిట్కాలు అందించారు. విషయ పరిజ్ఞానంపై ఎంత వరకు పట్టు ఉందని విద్యార్థులను ప్రశ్నించి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయ పాత్ర పోషించి, గణితంలో వర్గ, సమాసాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆటలు, వ్యాస రచన ఇతర అంశాలపై పట్టు కలిగి ఉండాలని అన్నారు. పాఠశాల గోడలపై విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ని పరిశీలించి అభినందించారు. అదే విధంగా ఇంటర్మీడియేట్ విద్యార్థులతో విషయ పరిజ్ఞానంపై సంభాషించారు. తరగతి గదిని శుభ్రంగా ఉంచుకోవాలని మిగితా విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనం, వారికి మెనూ ప్రకారం భోజనం పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి, దానికి అనుగుణంగా సరుకులు, కూరగాయలు ఉన్నాయో లేవో పరిశీలించారు. పరిసరాలు, వంటశాల పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. డెంగ్యు వ్యాధి ప్రబలుతున్న దృష్ట్యా మురికి నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి, పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గాంధీనగర్‌లో పర్యటించి, విషజ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇండ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు. సమీపంలోని అయిల్ ఫామ్ తోటను పరిశీలించి, కోతుల బెడదా లేకుండా చూసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

మరణించేంత వరకు కాంగ్రెస్‌లోనే ఉంటా

- డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తాను కాంగ్రెస్ పార్టీని వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని, తాను చచ్చేంత వరకు కాంగ్రెస్ లోనే ఉంటానని డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ అన్నారు. గురువారం మాజీ మంత్రి రామచంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో కలిసి మాట్లాడారు. కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది చాలా బాధాకరంగా ఉందని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. తమ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి అత్యంత అవినాభావ సంబంధం ఉందని, కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్‌గా అనేక సంవత్సరాలు తనతో పాటు తమ కుటుంబ సభ్యులందరూ కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశారని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులుగా నాకు అవకాశం ఇచ్చారంటే తాను కాంగ్రెస్ పార్టీకి చేసిన కృషి సేవలు ఆధారంగానే డీసీసీ అధ్యక్షుడు అనే బృహత్తరమైన కార్యాన్ని తనకు అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరుతుండుగా రామన్నకు కోవర్ట్ గా పనిచేస్తుండని చెప్పేసి దుష్ప్రచారం చేస్తున్నటువంటి ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి ఇలాంటి దుష్ప్రచారాలను ఇకనైనా మానుకోవాలని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశామని అన్నారు. ఒకవేళ అధిష్టానం సరియైన నిర్ణయం తీసుకొని మిమ్మల్ని రీవోక్ చేయించి, మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటే స్వాగతిస్తామని అన్నారు. టికెట్టు ఇస్తే కలిసి పని చేస్తామని అన్నారు. కానీ మీరు మాపై బురద జల్లే కార్యక్రమాలు దుష్ప్రచారాలు, చిల్లర ఎడిటింగ్‌లు ద్వారా మమ్మల్ని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో మీరు పని చేస్తున్నారని దాన్ని మానుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ తెలుసుకోవాలి..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ కంది శ్రీనివాస్ ముందుగా అందరిని గౌరవించడం నేర్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ తెలుసుకోవాలని అలా కాకుండా ఒంటెద్దు పోకడలకు పోయి తనకున్న విలువలను దిగజార్చుకోవద్దన్నారు. ఒకవేళ అధిష్టాన పెద్దలు మిమ్మల్ని తిరిగి పార్టీలోకి తీసుకుంటే అధిష్టానం నిర్ణయాన్ని స్వాగతిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-నార్నూర్



పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మిషన్ భగీరథ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పూసిగూడ గాదిగూడ మండలంలోని ఝరి పంప్‌హౌస్ వద్ద వారు నిరసన చేపట్టారు. మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. నిరసనలో వివిధ గ్రామాల భగిరథ కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక

నవతెలంగాణ-కడెం

సొంత స్థలం ఉండి సొంతింటి కలను నిజం చేసుకోలేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సర్వే మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతోంది. గురువారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శాంత ఆధ్వర్యంలో ఇటీవల గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న పత్రాలను వివరాలను మరోసారి పరిశీలిస్తూ, పూర్తి వివరాలతో పాటు లబ్ధిదారుల సంతకాలు సేకరిస్తున్నారు. అలాగే సంబంధిత స్థలాన్ని కొలతలు తీసుకొని వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కారోబారి చిన్న నర్సయ్య, సిబ్బంది నరేష్ గంగరాజం పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-బోథ్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు, బోథ్ మండలంలోని కౌట(బి) గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 36వేల విలువ గల చెక్కును, అదేవిధంగా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన వనిత రామోజీకి రూ.16వేల 500 చెక్కును అందజేశారు. అదేవిధంగా బోథ్ మండలంలోని కంఠేగావ్ గ్రామానికి చెందిన జాదవ్ రమణబాయికి రూ.12వేల చెక్కును అందజేశారు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన శ్రీపద పుష్పాలకు రూ.12వేల 500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్‌ను కలిసిన టీఎన్జీఓ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల అదిలాబాద్ అర్బన్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సంపత్ శ్రీనివాస్‌ను జిల్లా టీఎన్జీఓ యూనియన్ సభ్యులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్, సభ్యులు తిరుమల్‌రెడ్డి, చంద్రశేఖర్, సాయి, విజయ్, సంజయ్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులను స్వీకరించిందని, ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని సొంపల్లి, దోబిగూడ గ్రామలలో గృహలక్ష్మి పథకం సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు అసలైన అర్హులను గుర్తించాలని అన్నారు. గృహలక్ష్మి సర్వే కోసం వచ్చినప్పుడు లబ్దిదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

అర్హులైన లబ్దిదారులకు రుణాలు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు అర్హులైన లబ్దిదారులకు రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ బ్యాంకర్లతో జూన్ 2023 మాసాంతపు జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ, ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద లబ్దిదారులకు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.56.38 కోట్లు, 35623 మంది రైతులకు రూ.207.56 కోట్ల వ్యవసాయ రుణాలను వివిధ బ్యాంకులు అందించాయని తెలిపారు. పాడిపరిశ్రమ, ఉన్నత విద్యా, పరిశ్రమల స్థాపన, వికలాంగులకు స్వయం ఉపాధి రుణాలు నిబంధనలు మేరకు అందించాలని ఆదేశించారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్, డీసీసీబీ చైర్మెన్‌లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఎల్‌డీఎం ప్రసాద్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్ఎంవీ కృష్ణారావు మృతికి మంత్రి సంతాపం

నవతెలంగాణ-నిర్మల్

ప్రముఖ పాత్రికేయుడు, సంపాదకులు సీహెచ్ ఎంవీ కృష్ణారావు మరణం పట్ల గురువారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తనను కలిచి వేసిందని పేర్కొన్నారు. కృష్ణరావుని అందరం కూడా బాబాయి అని పిలుచుకునే వారమని పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. జర్నలిజంలో కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌మోహన్ గురువారం బోథ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, ఝరి సొసైటీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.